క్లుప్తంగా

తాగునీటి సమస్య రానీయొద్దు

వాకాడు : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం మండలంలోని పలు గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేద న్నారు. ఇంటింటా సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

మహిళ వైద్యానికి ఆర్థిక సాయం

కోట : కోట దళితవాడకు చెందిన యర్రమతి వెంకటేశ్వర్లు కుమార్తె అరుణజ్యోతి అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో షిరిడీ సాయి అక్షయ సేవా సమితి సభ్యులను ఆశ్రయించారు. వారు సోమవారం ఆమెకు రూ.10 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, గిరిధర్‌రెడ్డి, బాబురావు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసన

వెంకటగిరి రూరల్ : కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కవచ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు గుండు మనోజ్ ఆధ్వర్యంలో సోమవారం వెంకటగిరిలో నిరసన తెలిపారు. తొలుత సీహెచ్‌సీకి వెళ్లే కూడలి వద్ద ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాశీపేట కూడలి వద్ద మానవ హారం ఏర్పాటుచేశారు. పాకిస్తాన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలని వినతి



సమస్యను తహసీల్దార్‌కు విన్నవిస్తున్న రైతులు

చిట్టమూరు : మండలంలోని యాకసిరి పంచాయతీలో నెలకొన్న భూసమస్యలు పరిష్కరించాలని రైతులు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఒక రైతు సర్వే నంబర్ 218-1, 217లో కొంత భూమి కొనుగోలు చేశాడన్నారు. రెవెన్యూ రికార్డుల్లో కొన్న దానికంటే ఎక్కువగా నమోదు చేయించుకుని పక్కనున్న పొలాలను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని వాపోయారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సర్వే చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

బోసిపోయిన తహసీల్దార్ కార్యాలయం

కలువాయి(సైదాపురం) : కలువాయి తహసీల్దార్ కార్యాలయం సోమవారం వెలవెలబోయింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలు ఎవరూ రాలేదు. ప్రజలు చాలా సేపు పడిగాపులు పడ్డారు. చివరికి సిబ్బందిని అడిగితే అధికారులు నోషనల్ ఖాతాల విషయమై నెల్లూరు జాయింట్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారని చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు.

ట్రాక్టర్ స్వాధీనం

సైదాపురం: అనుమతులు లేకుండా తెల్ల రాయిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం ఎస్ఐ క్రాంతికుమార్ స్వాధీనం చేసుకున్నారు. కూటమి నేతలు చాగణం రాజుపాళెం గ్రామంలో విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే సోమవారం ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి నిఘా పెట్టారు. అక్రమంగా తెల్లరాయిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ముస్లింల ర్యాలీ



వెంకటగిరి రూరల్ : కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని నిరసిస్తూ ముస్లింలు సోమవారం వెంకటగిరిలో ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ హబీబ్ మసీదు నుంచి క్రాస్ రోడ్డు కూడలి వరకు సాగింది. వారు మాట్లాడుతూ భారతదేశ సమగ్రత, సౌభ్రాతృత్వానికి విఘాతం కలిగించే చర్యలను దీటుగా ఎదుర్కొంటామని తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు షేక్ ఆల్తాఫ్ రసూల్, బాబులాల్, తాజుద్దీన్, ఖాదర్‌ఖాన్, బాబావలి, గౌస్‌బాషా, జిలాని, ఇర్షాద్ పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు



పెళ్లకూరు: మండలంలోని కప్పగుంటకండ్రిగ మీదుగా పాలచ్చూరు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దీన్ని 1992-94లో అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి చొరవతో బీటీరోడ్డుగా అభివృద్ధి చేసి, స్వర్ణముఖి నదిపై కాజ్‌వే నిర్మించారు. తర్వాత దీని గురించి ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం బీటీరోడ్డు పూర్తిగా గ్రావెల్ రోడ్డుగా మారిపోయి పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. అత్యవసర సమయాల్లో 108 వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

అభివృద్ధికి ఆమడ దూరం

'మాది మంచి ప్రభుత్వం.. పేదల సంక్షేమమే మా ధ్యేయం. రూ.కోట్లు ఖర్చు చేసి రోడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నాం' అని కూటమి నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారు. చిట్టమూరు మండలం ఎల్లసిరి పంచాయతీ ఎల్లసిరి వడ్డికండ్రిగలో మౌలిక వసతులు లేక పేదలు పడరాని పాట్లు పడుతున్నారు. పూరి గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చినప్పుడు అది చేస్తాం.. ఇది చేస్తామని చెబుతారని, తర్వాత ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

- వడ్డికండ్రిగలో కనిపించని వసతులు
- పూరి గుడిసెల్లోనే జీవనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గ్రామంలోని పూరిళ్లు



తాగునీరు సరఫరా చేసే వాటర్ ట్యాంక్, బోరు



అధ్వానంగా ఉన్న వీధి

చిట్టమూరు : నాయుడుపేట, చిట్టమూరు మండలాలకు చెందిన కొన్ని కుటుంబాల వారు 15 ఏళ్ల క్రితం చిట్టమూరు మండలం ఎల్లసిరి పంచాయతీ ఎల్లసిరి వడ్డికండ్రిగ అటవీ ప్రాంతంలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం అక్కడ 40 కుటుంబాలు ఉన్నాయి. 60 మంది ఓటర్లు ఉన్నారు. అప్పట్లో తాగునీటి బోరు వేశారు. విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఇప్పటికీ ఆ బోరు నీరే వారికి ఆధారం. భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు మోటార్ వేస్తే పది నిమిషాలు నీరు వచ్చి ఆగిపోతుంది. మళ్లీ గంట తర్వాత మోటార్ ఆన్ చేస్తే కొంత నీరు వస్తుంది. ఇలా రోజంతా పడిగాపులు కాసి ట్యాంకును నింపుకుని అవసరాలకు వినియోగించుకుంటున్నారు. వీధుల్లో ఇప్పటికీ రోడ్లు నిర్మించలేదు. వర్షాకాలంలో వీధుల్లో నడిచే పరిస్థితి లేదు. మురుగు కాలువలు లేవు. వీధి దీపాలు వేయలేదు. పూరి గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారు. పక్కా ఇళ్లు మంజూరు చేయాలని పలుమార్లు కోరినా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని పేదలు ఆరోపిస్తున్నారు. అటవీ ప్రాంతం కావడంతో రాత్రిళ్లు విష సర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని వారు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థి తమ గ్రామానికి వచ్చి తనను గెలిపిస్తే వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, గంపగుత్తుగా ఓట్లు వేయించుకుని తర్వాత ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టాలు ఇవ్వాలి



15 ఏళ్లుగా పూరిళ్లలోనే ఉంటున్నాము. పక్కా ఇంటి కోసం వెళితే పట్టా అడుగుతున్నారు. రెవెన్యూ అధికారులను అడిగితే మీరు ఉంటున్న ప్రదేశం అటవీ ప్రాంతంలో ఉంది పట్టా ఇవ్వలేము అని అంటున్నారు. కూటమి నాయకులు స్పందించి ఇంటి పట్టాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– మల్లి వెంకటయ్య, ఎల్లసిరి వడ్డికండ్రిగ

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాము



గ్రామంలో వేసిన బోరులో 10 నిమిషాలు మాత్రమే నీరు వస్తుంది. తర్వాత గంట, రెండు గంటలు ఆగి మళ్లీ వేస్తే మరికొంత వస్తుంది. ఆ నీటిని చిన్న ట్యాంకుకు నింపుకుని వాడుకుంటున్నాం. ఆ నీరు అందరికీ చాలడం లేదు. మా గురించి పట్టించుకునే వారు కరువయ్యారు.

– బత్తల వెంకటమ్మ, ఎల్లసిరి వడ్డికండ్రిగ

విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో

వెంకటగిరి(సైదాపురం): పదో తరగతిలో ఫలితాల్లో 586 మార్కులు సాధించిన వెంకటగిరి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్‌కే సానియా అక్తర్‌ను సోమవారం ఎంఈవో-2 బాబయ్య అభినందించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వర్ణలక్ష్మి, ఉపాధ్యాయులు అప్పిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు సబ్ రిజిస్ట్రార్‌పై ఫిర్యాదు



ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న బాలగురవం బాబు

సూళ్లూరుపేట : సత్యవేడు సబ్‌రిజిస్ట్రార్ రూపవాణి కాసులకు కక్కుర్తిపడి నోటిఫికేషన్‌లో వున్న భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు ఆరోపించారు. ఆయన సోమవారం సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ సత్యవేడు మండలం రాళ్లకుప్పంలో ఉన్న కొన్ని భూములను గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేశారని, ఇందులో ఆమెకు భారీగా ముడుపులు అందాయని ఆరోపించారు. నోటిఫికేషన్‌లో వున్న భూములకు రిజిస్ట్రేషన్లు ఎలా చేస్తారని ప్రశ్నించారు. సూళ్లూరుపేట సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో వున్న తహసీల్దార్లు సక్రమంగా పనిచేయడం లేదని విమర్శించారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చడానికి పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటున్నారని తెలిపారు. సత్యవేడు, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం, కేవీబీపురం మండలాల్లో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందని, ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు అర్జున గురుమూర్తి, భాస్కర్ యాదవ్, శ్రీనివాస్ గౌడ, చిరంజీవి, వేల్‌రెడ్డి, శాంభం రాజన్, రఘునాథ్, అంబేడ్కర్, నిత్యానందం, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నిర్మాణాన్ని కూల్చివేస్తున్న అధికారులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని పాగొట్టం కాలనీలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను సోమవారం టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని బాధితులు వారితో వాగ్వాదానికి దిగారు. పాగొట్టం కాలనీలో వున్న భూమి తమదంటే తమదని ఇరువర్గాల వారు చెబుతున్నారు. దీనిపై కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో రోడ్డు పక్కన నిర్మాణాలు చేస్తున్నట్టు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు అందింది. టీపీవో బాలసుబ్రహ్మణ్యం, స్థానిక సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శులతో కలిసి అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనుమతి లేకుండా నిర్మిస్తున్నట్టు నిర్ధారించుకుని జేసీబీతో పిల్లర్లను తొలగించారు. భవన నిర్మాణ యాజమానులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ బాధితుల తరఫున అధికారులను నీలదీశారు. నోటీసులు ఇవ్వకుండానే నిర్మాణాలు ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. అధికారుల ఉత్తర్వులతో పాటు కోర్టు ఉత్తర్వులు ఉండడంతోనే కూల్చివేసినట్టు టీపీవో తేల్చిచెప్పారు.

మత్స్యకారులకు క్రికెట్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న అదానీ ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్ రంజన్

చిల్లకూరు : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని మత్స్యకారులకు దాతల సహకారంతో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అదానీ ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్ తెలిపారు. ఆయన సోమవారం గుమ్మళ్లదిబ్బ కొత్తూరులో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చేపల వేటకు 60 రోజులు నిషేధం విధించడంతో మత్స్యకారులకు విరామం దొరికిందన్నారు. ఈ క్రమంలో మత్స్యకార కాపులతో చర్చించి యువతకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి బహుమతిగా రూ.60 వేలు, రెండో బహుమతిగా రూ.40 వేలు, మూడో బహుమతిగా రూ.30 వేలు, నాలుగో బహుమతిగా రూ.20 వేలు, ఐదో బహుమతిగా రూ.15 వేలు, ఆరో బహుమతిగా రూ.10 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోట సతీష్‌యాదవ్, భక్తాని రామయ్య, మేకల వెంకటయ్య పాల్గొన్నారు.


'ఆసక్తిని బట్టి కోర్సులు ఎంపిక చేసుకోవాలి'



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిల్లకూరు : పదో తరగతి పాసై ఇంటర్‌లో చేరే విద్యార్థులు ఆసక్తిని బట్టి కోర్సులు ఎంపిక చేసుకోవాలని శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ ప్రతినిధి మేడిశెట్టి కల్యాణ్ తెలిపారు. గూడూరు పట్టణంలోని మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోమవారం ఇంటర్‌లోని కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది ఎంపీసీ, బైపీసీ కోర్సులపైనే దృష్టి పెడుతుంటారని తెలిపారు. అలా కాకుండా వివిధ రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటికి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారని, నోటిఫికేషన్లను గుర్తించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డికి సేవారత్న



పురస్కారం అందుకుంటున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న వాకాడు మండలం గంగన్నపాళెంకు చెందిన డాక్టర్ మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డికి సోమవారం మ్యూజికల్ అకాడమీ, ఆల్ ద బెస్ట్ అకాడమీ సంయుక్తంగా సేవారత్న జాతీయ పురస్కారం అందజేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ సుబ్రాంత్ పురస్కారం అందజేసి సత్కరించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

కలువాయి(సైదాపురం): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని కలువాయి ఇన్‌చార్జి ఎంపీడీవో భవాని తెలిపారు. కలువాయి మండలానికి 28 యూనిట్లు మంజూరైనట్టు తెలిపారు. 22 నుంచి 50 ఏళ్లలోపు ఉన్న నిరుద్యోగులు అర్హులని తెలిపారు. ఆసక్తి కల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని కోరారు.

కొత్త పింఛన్లకు దరఖాస్తులు

కలువాయి(సైదాపురం) : పింఛను తీసుకుంటూ మరణించిన వ్యక్తి భార్య పింఛను పొందే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని కలువాయి ఇన్‌చార్జి ఎంపీడీవో భవాని తెలిపారు. కలువాయి మండలంలో డిసెంబర్ 2023 నుంచి అక్టోబర్ 2024 మధ్య కాలంలో పింఛను పొందుతూ మరణించిన వారి భార్యలు మాత్రమే అర్హులని తెలిపారు. మండలంలో 97 మంది అర్హులు ఉన్నట్టు గుర్తించామని, వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, భర్త డెత్ సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రాలతో సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే నెల నుంచే పింఛను అందుతుందన్నారు.

కండలేరులో 45.392 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 45.392 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 260, పిన్నేరు కాలువకు 70, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

వేసవి శిక్షణా శిబిరాలు

వెంకటగిరి రూరల్ : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-2 బాబయ్య తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని మహాత్మా గాంధీ గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండలో తిరగకుండా పుస్తక పఠనంపై మక్కువ కలిగించాలన్నారు. కార్యక్రమంలో నదీతీరం పాఠశాల హెచ్ఎం రత్నశేఖర్, గుర్రాల రమేష్, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు

కోట: కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎస్.మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షుడిగా ఎ.మోహన్, సెక్రటరీగా ఎస్.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా బీవీ రమణ, ట్రెజరర్‌గా ఆర్.కాటయ్య, ఈసీ మెంబర్లుగా సూర్య, సాగర్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎల్.రామచంద్రరావు తెలిపారు. వారిని న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఘనంగా సన్మానించారు.

లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఆర్‌వీ రావు

గూడూరు రూరల్ : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 316-జే వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా గూడూరుకు చెందిన లయన్ ఆర్‌వీ రావు ఎంపికయ్యారు. గూడూరులోని మహేంద్ర ఎలైట్ ఫంక్షన్ హాలులో సోమవారం ఆర్‌వీ రావును ఘనంగా సన్మానించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సోమిశెట్టి చెంచురామయ్య, రూపేష్‌రెడ్డి, బాబు అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు రజక వీధిలో చోరీ

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు రజక వీధిలోని ఒక ఇంటిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. రజక వీధిలోని దువ్వూరు నరసమ్మ ఇంటికి తాళం వేసుకుని శ్రీకాళహస్తిలోని తమ్ముడి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి దుండగులు తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.60 వేలు నగదు, రెండు సవర్ల బంగారు, 250 గ్రాముల వెండి ఆభరణాలను చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



రాపూరు : కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎంపీడీవో భవాని



ఓజిలి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

రాపూరు/ఓజిలి : ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రోత్సహించాలని రాపూరు, ఓజిలి ఎంపీడీవోలు భవాని, విజయలక్ష్మి తెలిపారు. ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువులు, కషాయాలు వినియోగించి కూరగాయలు పండించుకుని తింటే రోగాలు రావన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాపూరు ప్రకృతి వ్యవసాయ నిర్వాహకులు అశోక్, వెంకటాద్రి, రాజ్యలక్ష్మి, బలరామిరెడ్డి, అంకమరాజు, ఓజిలికి చెందిన డీఎంఎంటీ వీరరాఘవయ్య, మండల ఇన్‌చార్జి జైతున్, ఎంటీ తిరుమల, ఎల్‌టూ చెంచమ్మ, యామిని, ధనుంజయ, అజిత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కోట: మండలంలోని లక్ష్మక్కకండ్రిగలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి డేటా సేకరించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు శేషాచలం, జనార్దన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది శ్రీనివాసులు, దినేష్, పద్మ, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సాగు ఖర్చు తగ్గుదల

సూళ్లూరుపేట : భూసార పరీక్షలు చేసుకుని ఫలితాలకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే ఖర్చు తగ్గుతుందని సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ వ్యవసాయ సంచాలకులు జి.అనిత తెలిపారు. ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తడ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో 2,450 నమూనాలను సేకరించాల్సి వుండగా ఇప్పటి వరకు 1,170 నమూనాలు సేకరించినట్టు వెల్లడించారు. ఖరీఫ్ సాగు పెరగడంతో నమూనాలు సేకరించలేకపోయినట్టు తెలిపారు. మూడు మండలాల్లో ఇప్పటికే 700 ఎకరాల్లో వరినాట్లు వేశారని, మరో మూడు వేల ఎకరాల్లో వరి నాటేందుకు నారు మళ్లు సిద్ధం చేసుకున్నట్టు తెలిపారు. వరికోతలు పూర్తయిన వెంటనే ప్రతి రైతూ భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాల ఆధారంగా ఎరువులు, పురుగు మందులు వాడాలని సూచించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పంట వివరాలను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రస్తుతం వరిపంట సాగుచేసే కౌలు రైతులు వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బందిని సంప్రదించి గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు.

లేఅవుట్లపై అధికారుల విచారణ



కొలతలు వేస్తున్న అధికారులు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని వెంకటరెడ్డిపల్లి, కుల్లూరు గ్రామాల్లో గతంలో ఏర్పాటుచేసిన లేఅవుట్లపై సోమవారం డ్వామా సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్ ఆధ్వర్యంలో సమగ్రంగా విచారణ చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ కొలతలు తీస్తున్నట్లు తెలిపారు. లేఅవుట్ల బిల్లులు మంజూరు చేసే విషయంలో ఆలస్యం చేసేందుకే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కిషోర్, సాంబ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మా పిల్లలను వేరే స్కూల్‌కు మార్చొద్దు



తిరుపతి కలెక్టరేట్‌లో సీఎన్‌పేట కాలనీ ప్రజలు

పెళ్లకూరు : ఎన్‌రోల్‌మెంట్‌లో భాగంగా మా గ్రామంలోని పిల్లలను వేరే పాఠశాలకు తరలించొద్దని మండలంలోని చెన్నప్పనాయుడుపేట దళితకాలనీ వాసులు కోరారు. వారు సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ పేరుతో 4, 5 తరగతులను సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలకు తరలిస్తున్నారని తెలిపారు. లా ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. చిన్న పిల్లలు ప్రతిరోజూ రెండు కిలోమీటర్లు దూరం కాలినడకన వెళ్లి రావడం కష్టంగా ఉంటుందన్నారు. పిల్లలను కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే కొనసాగించాలని కోరారు.

ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



రాపూరులో రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ కార్మికులు



వెంకటగిరి డిపో ఎదుట రిలే నిరాహార దీక్ష

రాపూరు/వెంకటగిరి రూరల్/గూడూరు రూరల్: ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎన్ఎంయూఏ నాయకులు డిమాండ్ చేశారు. రాపూరు, వెంకటగిరి, గూడూరు ఆర్టీసీ డిపోల ఎదుట కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రాపూరు డిపో కార్యదర్శి రమణయ్య, వెంకటగిరి డిపో సెక్రటరీ కేవీ రత్నం, గూడూరులో జిల్లా ట్రెజరర్ మోహన్ మాట్లాడుతూ 1-2019 సర్క్యులర్‌ను విధిగా అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ రద్దు చేయాలని, ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. మహిళా కార్మికులకు పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వెంకటగిరిలో కార్మికులకు జిల్లా సెక్రటరీ బీఎస్‌దాసు, జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ ఆర్ముగం సంఘీభావం తెలిపారు. రాపూరులో కొండయ్య, శ్రీహరి, రావు, పుల్లయ్య, కృష్ణయ్య, వెంకటగిరిలో బాషా, ఇంతియాజ్, కృష్ణ, డీపీ స్వామి, నరసయ్య, పెంచలయ్య, ఎస్‌హెచ్‌రెడ్డి, కృష్ణ, నాగేంద్ర, గూడూరులో జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రవణ్, డిపో ప్రెసిడెంటు ప్రవీణ్, సెక్రటరీ శ్రీనివాసులు, గౌస్, వెంకయ్య, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, పోలయ్య పాల్గొన్నారు.

నేడు వెంకటగిరికి నేదురుమల్లి రాక

వెంకటగిరి (సైదాపురం) : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం వెంకటగిరికి రానున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటారు. ఈ మేరకు నేదురుమల్లి కార్యాలయవర్గ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మే 29న గంధోత్సవం

నాయుడుపేట టౌన్: పట్టణంలోని హజరత్ ఖాదర్‌షావలీ గంధోత్సవాన్ని మే నెల 29న నిర్వహించనున్నట్టు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. వారు సోమవారం సమావేశమై గంధోత్సవం నిర్వహణపై చర్చించారు. చాన్‌బాషా, శేఖర్, షేక్ రియాజ్, నీలిశెట్టి వంశీ, మహేంద్ర, చంద్ర శేఖర్, మురళీ, మస్తాన్, పఠాన్ హర్షద్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

అపరాధ రుసుంలో 50 శాతం రాయితీ

చిల్లకూరు: గూడూరు మున్సిపాలిటీలోని ఆస్తి, నీటి పన్నుల బకాయిలపై విధించే అపరాధ రుసుం 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలు ఈ నెల 30వ తేదీలోగా ఆస్తి పన్నులు చెల్లిస్తే రాయితీ పొందవచ్చని తెలిపారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌కు చెక్

చిట్టమూరు : క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నయం చేయొచ్చని స్విమ్స్ వైద్యులు చైతన్య భాను, పద్మావతి తెలిపారు. మండలంలోని యాకసిరి, బురదగల్లికొత్తపాళెంలో సోమవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళా తప్పనిసరిగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. చిట్టమూరు, మల్లాం పీహెచ్‌సీ వైద్యులు పద్మావతి, మదన్‌మోహన్ పాల్గొన్నారు.